క్లుప్తంగా

హైందవ పరిరక్షణ అందరి బాధ్యత

బోట్‌క్లబ్: సమాజంలో హైందవ పరిరక్షణ అందరి బాధ్యత అని బ్రాహ్మణ అభివృద్ధి సమాఖ్య సేవా సంఘం అధ్యక్షులు పసుమర్తి సత్యనారాయణమూర్తి అన్నారు. సంఘం ఆధ్వర్యంలో స్థానిక ఇంద్రపాలెం గోశాలలో సోమవారం ఉచిత ఉపనయన కార్యక్రమాలు నిర్వహించారు. సంఘ గౌరవాధ్యక్షులు గరిమెళ్ల లక్ష్మీనారాయణ శర్మ మాట్లాడుతూ ఉచితంగా ఉపనయన కార్యక్రమం నిర్వహించడం అశ్వమేధ వంటి యాగాలు చేసిన పుణ్యం వస్తుందన్నారు. ప్రతి ఒక్కరూ చిన్న వయస్సులోనే ఉపనయనాది సంస్కారాలు తమ పిల్లలకు జరిపించాలన్నారు. తద్వారా హిందూ ధర్మం, మత గొప్పతనం, మంత్ర బలం పిల్లలకు తెలియజేసేందుకు అవకాశం ఉంటుందన్నారు.

గిట్టుబాటు ధర కోసం రైతుల ధర్నా



పెద్దాపురంలో ధర్నా చేస్తున్న రైతు కూలీలు

పెద్దాపురం: రైతు పండించిన పంటకు ప్రభుత్వం గిట్టుబాటు ధర కల్పించాలని ఏపీ రైతుకూలీ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కర్నాకుల వీరాంజనేయులు డిమాండ్ చేశారు. స్థానిక వేంకటేశ్వర స్వామి గుడి సెంటర్‌లో సోమవారం రైతుకూలీలతో కలిసి ఆయన ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి వల్లూరి రాజుబాబు అధ్యక్షతన జరిగిన సమావేశంలో వీరాంజనేయులు మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం ప్రజా వ్యతిరేక విధానాలను అవలంబిస్తోందని దుయ్యబట్టారు. వ్యవసాయ రంగాన్ని కార్పొరేట్ శక్తులకు కట్టబెట్టే కుట్రలు చేస్తోందని ఆరోపించారు. రైతులు ఆరుగాలం శ్రమించినా గిట్టుబాటు ధర కల్పించలేని దుస్థితిలో ప్రభుత్వాలు పాలన సాగిస్తున్నాయని మండిపడ్డారు. ఉపాధి హామీ పథకంలో ఏడాది 200 రోజులు పని కల్పించి రోజు కూలీ రూ.600 చొప్పున ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు డి.సురేష్, వెల్లె సత్తిబాబు, స్త్రీ విముక్తి నాయకులు రెడ్డి దుర్గాదేవి, కోట వీరబాబు, సుందరెడ్డి రాజు, సుంకర శ్రీను, పెరుమాళ్ల శ్రీను, బాబురావు, పిల్లి దుర్గాప్రసాద్, కోట ఈశ్వరరావు, కొట్టేటి ప్రసాద్ పాల్గొన్నారు.

జోరుగా శివాలయం నిర్మాణం

సామర్లకోట: మండలంలోని గొంచాల గ్రామంలో శివాలయ నిర్మాణ పనులు జోరుగా సాగుతున్నాయి. గ్రామంలో రామాలయాలతో వివిధ దేవతామూర్తుల ఆలయాలు ఉన్నాయి. శివాలయం లేకపోవడంతో ఆలయం నిర్మాణం చేయాలని గ్రామస్తులు సంకల్పించారు. ఈ మేరకు దాతల సహకారంలో గ్రామ దేవతగా ప్రసిద్ధి చెందిన శ్యామలాంబ ఆలయం వద్ద శివాలయం నిర్మించేందుకు పనులు ప్రారంభించారు. ఆలయ నిర్మాణానికి సుమారు రూ.కోటి ఖర్చయ్యే అవకాశం ఉందని నిర్వాహకులు తెలిపారు. దాతలు ముందుకొచ్చి మెటీరియల్‌కు సహకరించాలని కోరారు. దాతలు ఇచ్చిన విరాళాలకు ప్రత్యేకంగా బోర్డు ఏర్పాటు చేసినట్టు తెలిపారు. ప్రతి సోమవారం శివుని దర్శనానికి సామర్లకోట రావాల్సి వస్తోందని, దీనిని దృష్టిలో ఉంచుకుని ఆలయాన్ని నిర్మిస్తున్నట్టు మాజీ సర్పంచ్ ముమ్మిడి వెంకటేశ్వరరావు తెలిపారు.

సినిమాలు



ఆనంద్ సినిమాస్:	ఫైనల్ డెస్టినేషన్ బ్లడ్ లైన్స్, లవ్‌లీ, శుభం
దేవీ మల్టీపెక్స్:	సింగిల్, శుభం, ఎలివెన్
లక్ష్మి:	మిషన్ ఇంపాజబుల్
సత్యగౌరి:	ఫైనల్ డెస్టినేషన్ బ్లడ్ లైన్స్
తిరుమల:	23
సీఅండ్‌సీ:	ఫైనల్ డెస్టినేషన్ బ్లడ్ లైన్స్
సీఅండ్‌సీ–2:	హిట్ ది థర్డ్ కేస్
శ్రీప్రియ:	మిషన్ ఇంపాజబుల్
పద్మప్రియ:	సింగిల్

కుళాయిలో కాలకూటం

- మున్సిపల్ పైపుల నుంచి నాచురంగులో తాగునీరు
- బెంబేలెత్తుతున్న నగరవాసులు
- శశికాంత్ నగర్ ఫిల్టరేషన్ ప్లాంట్‌లో అంతంతమాత్రంగా శుద్ధి!

కాకినాడ రూరల్: నగరంలోని పలు ప్రాంతాలకు కుళాయిల నుంచి సరఫరా అవుతున్న తాగు నీటిని చూసి నగరవాసులు హడలెత్తిపోతున్నారు. రంగు మారిన నీటినే కుళాయిల ద్వారా కాకినాడ కార్పొరేషన్ యంత్రాంగం పంపిణీ చేస్తుండడంతో, వ్యాధుల బారిన పడతామని భయాందోళనకు గురవుతున్నారు. సామర్లకోటలో స్టోరేజ్ ట్యాంక్ నుంచి వచ్చే గోదావరి జలాలను కాకినాడ రెండో డివిజన్‌లోని శశికాంత్ నగర్‌లో ఉన్న ఫిల్టరేషన్ ప్లాంట్ వద్ద నీటిని శుద్ధి చేసి, నగరంలోని కొన్ని ప్రాంతాలకు తాగు నీటి అవసరాలు తీర్చుతున్నారు. శశికాంత్ నగర్‌లో ఏడు ఫిల్టర్ బెడ్లు అందుబాటులో ఉండగా, ప్రస్తుతం నాలుగింటినే వినియోగిస్తున్నారు. ఇక్కడ సుమారు 40 వేల మిలియన్ల లీటర్ల నీటిని ఫిల్టర్ చేసే సామర్థ్యం ఉండగా, ప్రస్తుతం 20 వేల మిలియన్ లీటర్ల నీటిని శుద్ధి చేస్తున్నారు. ఇక్కడి నుంచి శశికాంత్ నగర్‌తో పాటు, దుమ్ములపేట, భాస్కర్ నగర్, శ్రీనివాస్ బ్యాంక్ కాలనీ, డి–మార్ట్ ఏరియా తదితర ప్రాంతాల్లో ఏడు రిజర్వాయర్లకు నీటిని పంపిణీ చేసి, అక్కడి నుంచి కుళాయిలకు నీటిని సరఫరా చేస్తున్నారు. గోదావరి జలాలు నిలుపుదలతో సామర్లకోట వద్ద స్టోరేజ్ ట్యాంక్ నుంచి నీటిని తీసుకుని శశికాంత్ నగర్‌లో శుద్ధి చేసిన తరువాత నగరవాసుల అవసరాలకు సరఫరా చేస్తున్నారు. వారం రోజులుగా కాకినాడలో ఒకటి, రెండు, మూడు డివిజన్లతో పాటు, 50వ డివిజన్ ప్రాంతంలో కుళాయిల నుంచి నాచురంగులో నీరు వస్తోంది. ఒక్కోసారి ఎరుపు రంగులోను వస్తుండడంతో.. శుద్ధి చేయకుండానే నీటిని సరఫరా చేస్తున్నారని స్థానికులు మండిపడుతున్నారు. సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని, తాగు నీరు కలుషితం కావడంతో రోగాలొచ్చే అవకాశం ఉందని, తక్షణమే సమస్యను పరిష్కరించాలని వారు కోరుతున్నారు.


కాకినాడ రెండో డివిజన్‌లో కుళాయి నుంచి నాచురంగులో వస్తున్న నీరు


సీసాలో రంగు మారి ఉన్న మున్సిపల్ తాగునీరు

పరిష్కారం అవుతుంది

"కాలువ ద్వారా వచ్చేటప్పుడు నేరుగా ఫిల్టరేషన్ ప్లాంట్‌కు నీరు చేరేది. ఇప్పుడు స్టోరేజి ట్యాంక్‌లో నీటిని తీసుకోవడంతో రంగు ఎక్కువగా పసరగా ఉంది. ఫిల్టర్ బెడ్‌లో ఫిల్టర్లు మార్పు చేసి శుద్ధి చేస్తున్నాం. సమస్య పరిష్కారం అవుతుంది."
– ఫణీంద్రకుమార్, డీఈఈ, ఎలక్ట్రికల్ విభాగం, నగరపాలక సంస్థ

రంగుమారిన నీరు వస్తోంది


"నగరవాసులకు తాగు నీటి అవసరాల కోసం కోట్లాది రూపాయలు వ్యయం చేస్తున్నారు. కుళాయిల నుంచి మాత్రం శుద్ధి చేసిన నీటిని అందించలేకపోతున్నారు. రంగుమారిన నీటిని అందించడంతో తాగేందుకు భయపడుతున్నాం."
– బాలి భువనేశ్వరి, మూడో డివిజన్, కాకినాడ

తక్షణమే పరిష్కరించాలి


"శశికాంత్‌నగర్ వాటర్ ఫిల్టరేషన్ ప్లాంట్ నుంచి పంపిణీ చేస్తున్న తాగు నీరు రంగు మారి వస్తున్నందున తాగేందుకు భయపడాల్సి వస్తోంది. తక్షణం సమస్యను పరిష్కరించి, శుద్ధి చేసిన నీటినే కుళాయిల ద్వారా అందించాలి."
– సూరవరపు ఆదివిష్ణు, రెండో డివిజన్, కాకినాడ

ఉషు చాంపియన్‌షిప్‌లో బంగారు పతకం


ఉషు చాంపియన్‌షిప్‌లో బంగారు పతకం సాధించిన లోవరాజును సత్కరిస్తున్న కలెక్టర్ షణ్మోహన్

కరప: ఏపీ స్టేట్ ఉషు చాంపియన్‌షిప్ సీనియర్ టోర్నమెంట్‌లో కరప మండలం జి.భావారం గ్రామానికి చెందిన యు.లోవరాజు 80 కిలోల విభాగంలో బంగారు పతకం సాధించాడు. కర్నూలులో ఈ నెల 12 నుంచి 14వ తేదీ వరకు ఈ పోటీలు జరిగినట్టు లోవరాజు తెలిపారు. కాకినాడ కలెక్టరేట్‌లో సోమవారం కలెక్టర్ షణ్మోహన్‌ను లోవరాజు కలవగా ఆయన అభినందించారు. తనను జాతీయ స్థాయి పోటీలకు జిల్లా ఉషు సంఘం ఎంపిక చేసినట్టు లోవరాజు తెలిపారు. విజేతను డిస్ట్రిక్ట్ స్పోర్ట్స్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ బి.శ్రీనివాసకుమార్, జిల్లా ఉషు సెక్రటరీ ఆర్.సుందరం, స్టేట్ సెక్రటరీ బి.నరసింహారావు, జి.భావారం సర్పంచ్ రొక్కాల గణేష్ తదితరులు అభినందించారు.

ఉచిత విద్యకు దరఖాస్తుల ఆహ్వానం

బోట్‌క్లబ్: రోటరీ గోల్డెన్ జూబ్లీ క్లబ్, చేయూత సంస్థ సంయుక్తాధ్వర్యంలో ఒకటి నుంచి ఏడో తరగతి వరకు చేయూత హాస్టల్‌లో ఉచితంగా విద్యనభ్యసించడానికి పిల్లల నుంచి ప్రవేశ దరఖాస్తులను ఆహ్వానిస్తున్నామని సంస్థ అధ్యక్షులు మొండి రవికుమార్ సోమవారం విలేకర్లకు తెలిపారు. ఏ ప్రాంతం వారైనా ఈ ఉచిత విద్యకు దరఖాస్తు చేసుకోవడానికి అవకాశం ఉందన్నారు. ఈ నెల 31వ తేదీలోగా దరఖాస్తులను అందజేయాలన్నారు. అనాథ, నిరుపేద పిల్లలకు చదువును చేరువ చేయాలన్న ప్రధానాశయంతో ఉచితంగా విద్య, వసతి, భోజన సదుపాయాలు కల్పిస్తున్నామన్నారు. తల్లిదండ్రులు కోల్పోయిన వారికి తొలి ప్రాధాన్యం, తల్లిని కోల్పోయిన వారికి రెండో ప్రాధాన్యం, తండ్రిని కోల్పోయిన వారికి మూడో ప్రాధాన్యం కల్పిస్తామని చెప్పారు. రాత పరీక్ష, ఇంటర్వ్యూ ఆధారంగా ప్రవేశాలు ఉంటాయన్నారు. దరఖాస్తులు పంపేవారు తప్పనిసరిగా ఆధార్ కార్డు, తల్లిదండ్రుల్లో మరణించిన వారి ధ్రువీకరణ పత్రాల జిరాక్స్ కాపీలను జత చేయాలన్నారు. ఇతర వివరాలకు 86397 27476 నంబర్‌లో సంప్రదించవచ్చని తెలిపారు.

సుందరయ్య ఆశయాలు స్ఫూర్తిదాయకం


సుందరయ్య చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సీపీఎం నాయకులు


వలసపాకలలో సీఐటీయూ ఆధ్వర్యంలో సుందరయ్య చిత్రపటానికి నివాళులు


రమణయ్యపేటలో సుందరయ్య చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సభ్యులు

కాకినాడ సిటీ: స్వాతంత్ర్య సమరయోధుడు, దక్షిణ భారత కమ్యూనిస్టు ఉద్యమ నిర్మాత పుచ్చలపల్లి సుందరయ్య వర్ధంతి సోమవారం స్థానిక సుందరయ్య భవన్‌లో జరిగింది. సీపీఎం నగర కమిటీ సభ్యుడు కె.సత్తిరాజు అధ్యక్షత వహించారు. ముందుగా పీవీ రాఘవులు, వర్మ, కర్రి నాగేశ్వరరావు తదితరులు సుందరయ్య చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కమిటీ సభ్యురాలు జి.బేబీరాణి మాట్లాడుతూ, చిన్న వయసులోనే కుల వివక్షను వ్యతిరేకించి సుందరయ్య చరిత్ర సృష్టించారన్నారు. స్వాతంత్రోద్యమంలో యువకుడిగా పాల్గొని, తదుపరి కమ్యూనిస్టుగా మారి సీపీఎం తొలి ప్రధాన కార్యదర్శిగా పని చేశారన్నారు. భారత పార్లమెంటులో తొలి ప్రతిపక్ష నేతగా, ఆంధ్రప్రదేశ్ శాసన మండలిలోనూ ప్రజావాణి వినిపించారన్నారు. దేశంలో భూ సంస్కరణలను అజెండాలోకి తెచ్చి, తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటానికి సుందరయ్య నాయకత్వం వహించారన్నారు. వ్యక్తిగత జీవితంలో నిజమైన కమ్యూనిస్టుగా కార్యాచరణ చేపట్టిన సుందరయ్య తరతరాలకు స్ఫూర్తిదాయకంగా నిలుస్తారని కొనియాడారు. పార్టీ నగర కన్వీనర్ పలివెల వీరబాబు, కర్రి నాగేశ్వరరావు, కె.వీరబాబు, వాసంశెట్టి చంద్రరావు, జోగా అప్పారావు ప్రసంగిస్తూ, సుందరయ్య జీవిత విశేషాలు వివరించారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా కమిటీ సభ్యులు సీహెచ్ రాజ్‌కుమార్, నగర కమిటీ సభ్యుడు మలకా వెంకటరమణ, దుంపల ప్రసాద్, నాగాబత్తుల సూర్యనారాయణ, మేడిశెట్టి వెంకటరమణ, ఎం.హరనాథ్, గోవిందరాజులు, వెంకట్రావు, పద్మనాభం, రాణి, భారతి, రామలక్ష్మి, కుమారస్వామి, చిట్టిబాబు, సాహిత్ తదితరులు పాల్గొన్నారు.

అవిశ్రాంత పోరాట యోధుడు సుందరయ్య

కాకినాడ రూరల్: కమ్యూనిస్టు యోధుడు పుచ్చలపల్లి సుందరయ్య వర్ధంతిని సోమవారం కాకినాడ రూరల్‌లోని పలు ప్రాంతాల్లో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి ఘన నివాళులర్పించారు. చీడిగ రెవెన్యూ కాలనీలో సీపీఎం నాయకుడు లోవరాజు అధ్యక్షత జరిగిన కార్యక్రమంలో సుందరయ్య చిత్రపటానికి సీనియర్ నాయకుడు జత్తుగ శ్రీనివాసరావు, పెద్దింశెట్టి రామకృష్ణ, అంకం సుబ్రహ్మణ్యం తదితరులు నివాళులర్పించారు. వలసపాకల గ్రామంలోని సీఐటీయూ కార్యాలయంలో పుచ్చలపాటి సుందరయ్య చిత్రపటానికి సీఐటీయూ మండల కన్వీనర్ టి.రాజా, నీలయ్య, సత్యనారాయణ, బలరాం, రాంబాబు, దుర్గాప్రసాద్, నూకరాజు, సత్తిబాబు, సల్మాన్‌రాజు, సింహాద్రి, త్రిమూర్తులు తదితరులు నివాళులర్పించారు. అడబాల ట్రస్ట్ ఆధ్వర్యంలో స్థానిక రమణయ్యపేట ఏపీఐఐసీ కాలనీలో జరిగిన కార్యక్రమంలో కమ్యూనిస్టు గాంధీ సుందరయ్య చిత్రపటానికి గ్రంథాలయ సంస్థ విశ్రాంత అధికారి చింతపల్లి సుబ్బారావు, అడబాల రత్నప్రసాద్, నిమ్మకాయల వెంకటేశ్వరరావు తదితరులు నివాళులర్పించారు.

వర్షం కురిసి.. ఊరటనిచ్చి..

బోట్‌క్లబ్: మూడు వారాలుగా ఉక్కపోత, వేడి గాలులతో ఇబ్బంది పడుతున్న ప్రజలకు సోమవారం ఉదయం 6.30 నుంచి మధ్యాహ్నం వరకూ పడిన వర్షపు జల్లులతో సేదతీరారు. ఉదయం 10 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకూ వేడి గాలులతో సతమతమైన ప్రజలకు వర్షం కాస్త ఊరటనిచ్చింది. ప్రజలు వర్షపు జల్లులకు ఆనందం వ్యక్తం చేశారు. కాకినాడ నగరంలో ఉదయం నుంచి మధ్యాహ్నం వరకూ పలు దఫాలుగా వర్షపు జల్లులు పడ్డాయి. దీంతో ప్రజలకు వేడి గాలుల నుంచి కాస్త ఉపశమనం లభించింది. ఈ నెల 25 నుంచి రోహిణి కార్తె ప్రారంభం కాకుండానే వర్షం కురవడంతో ముందు ముందు వేసవి తీవ్రత తగ్గుతుందని ప్రజలు భావిస్తున్నారు.


కాకినాడ నగరంలో కురుస్తున్న వర్షం

పంచారామ క్షేత్రంలో ప్రత్యేక పూజలు


ప్రత్యేకాలంకరణలో కుమారారామ భీమేశ్వరస్వామి

సామర్లకోట: వైశాఖ శుద్ధ సప్తమి కావడంతో పంచారామ క్షేత్రంలో సోమవారం కుమారారామ భీమేశ్వర స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయంలో స్వామి వారికి, అమ్మవారికి, ఉపాలయాల్లోను అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారిని దర్శించుకోవడానికి అధిక సంఖ్యలో భక్తులు ఆలయానికి తరలి వచ్చారు. స్వామివారి తొలి అభిషేకం తిలకించడానికి భక్తులు బారులు తీరారు. భక్తులు ఆలయ ప్రాంగణంలో ధ్వజ స్తంభం వద్ద శివలింగానికి పాలు, ఆలయ పుష్కరణిలోని నీటితో అభిషేకాలు చేశారు. భక్తులకు ఈఓ బళ్ల నీలకంఠం ఆధ్వర్యంలో ఉదయం పులిహోర, మధ్యాహ్నం అన్నప్రసాదం, సాయంత్రం శనగలు, పులిహోర ప్రసాదంగా ఏర్పాటు చేశారు. ఆలయ పండితులు వేమూరి సోమేశ్వరశర్మ, అల్లాకి రాజ్‌గోపాల్‌శర్మ, శ్రీకాకుళపు సత్యనారాయణమూర్తి, వినయ్, చెరుకూరి రాంబాబు, సన్నిధిరాజు వెంకన్న పూజాది కార్యక్రమాలు నిర్వహించారు. సాయంత్రం స్వామివారికి, అమ్మవారికి ప్రత్యేక అలంకరణలు చేశారు.

వేంకటేశ్వరస్వామికి జన్మ నక్షత్ర పూజలు


యండమూరులోని మీసాల వేంకటేశ్వరస్వామి


సాంబమూర్తినగర్‌లో స్వామివారికి అభిషేకం చేస్తున్న అర్చకులు


ప్రత్యేకాలంకరణలో వైభవ వేంకటేశ్వరస్వామి

కరప: యండమూరులో వేంచేసిన సామ్రాజ్యలక్ష్మి, గోదాదేవి సమేత వేంకటేశ్వరస్వామి ఆలయంలో వైశాఖ మాసం సోమవారం స్వామివారి జన్మ నక్షత్రం శ్రవణం కలియడంతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయంలోని వేంకటేశ్వరస్వామి, అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించి, ప్రధానార్చకుడు పెద్దింటి సీతారామం పూజాది కార్యక్రమాలు జరిపించారు. ఈ సందర్భంగా భక్తులతో వేంకటేశ్వర స్వామి వ్రతాలు చేయించారు. యండమూరు, పరిసర గ్రామాలకు చెందిన భక్తులు వ్రతాలు చేయించుకుని, స్వామివారిని దర్శించుకుని, తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. అలాగే పెనుగుదురు, గురజనాపల్లి, వేళంగి, కూరాడ తదితర గ్రామాల్లోని వేంకటేశ్వర స్వామి ఆలయాల్లో స్వామివారికి జన్మ నక్షత్ర పూజలు జరిగాయి. కరప విష్ణ్వాలయంలోని వేంకటేశ్వరస్వామికి అర్చకుడు పెద్దింటి గోపాలకృష్ణ, అనంతాచార్యులు జన్మ నక్షత్ర పూజలు చేశారు.

బోట్‌క్లబ్: నగరంలోని సాంబమూర్తినగర్‌లో ఉన్న వైభవ వేంకటేశ్వరస్వామి ఆలయంలో శ్రవణా నక్షత్రం సందర్భంగా సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం ఆలయ అర్చకులు స్వామివారికి పంచామృతాభిషేకం నిర్వహించారు. అనంతరం స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించారు. సూపర్‌బజార్ మాజీ చైర్మన్ ముమ్మిడి గోవిందు దంపతులు స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.


యండమూరు వేంకటేశ్వరస్వామి ఆలయంలో వ్రతాలు చేస్తున్న భక్తులు

ఆహారపు అలవాట్లతో వ్యాధులు

బోట్‌క్లబ్: ప్రస్తుత ఆహారపు అలవాట్ల కారణంగా వ్యాధులు సంక్రమిస్తున్నాయని ప్రముఖ జీర్ణకోశ వ్యాధుల వైద్య నిపుణుడు ఆకుల వెంకన్నబాబు అన్నారు. స్థానిక సాయిభార్గవ స్కానింగ్ సెంటర్‌లో సోమవారం ఇండియన్ డెంటల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ప్రపంచ ఐబీడీ (ఇన్‌ఫ్లోమేటరీ బౌల్ డిసీజెస్) దినం సందర్భంగా అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఒకప్పుడు పాశ్చాత్య వ్యాధిగా పరిగణించబడిన ఐబీడీ ప్రస్తుతం మన దేశంలో ముఖ్యమైన ఆరోగ్య సమస్యగా పరిణమించిందన్నారు. ఆహారపు అలవాట్లలో గణనీయమైన మార్పులు వచ్చాయన్నారు. తాజా పండ్లు, ఆకుకూరలు, కూరగాయలు తక్కువగా తింటున్నామన్నారు. ప్రాసెస్ చేసిన ఆహారాలైన పిజ్జా, బర్గర్, కొవ్వు శాతం ఎక్కువగా ఉన్న నూనెలను తీసుకోవడం వల్ల గట్ ఫ్లోరా సున్నితమైన సమతుల్యతను దెబ్బతీస్తుందన్నారు. పేగుల్లో దీర్ఘకాలిక మంట ప్రమాదాన్ని పెంచుతాయన్నారు. ఈ వ్యాధి ఉన్న వారిలో పొత్తికడుపులో నొప్పి, తిమ్మిరి, మలంలో రక్తం, దీర్ఘకాలిక విరేచనాలు వంటి లక్షణాలు ఉంటాయన్నారు. ఈ కార్యక్రమంలో సంఘ రాష్ట్ర కార్యదర్శి అడ్డాల సత్యనారాయణ, సభ్యులు శ్రీవల్లీ, యేరూష, భాను పాల్గొన్నారు.


అవగాహన కల్పిస్తున్న డాక్టర్ వెంకన్నబాబు

కుంభవృష్టితో అన్నదాతకు గుబులు



సామర్లకోటలో కురిసిన వర్షం


బరకాలు కప్పి ఉన్న ధాన్యం రాశులు

- ఎక్కడి ధాన్యం అక్కడే..
- పట్టించుకోని యంత్రాంగం

సామర్లకోట: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం కారణంగా సోమవారం తెల్లవారుజాము నుంచి కుంభవృష్టి కురిసింది. పల్లపు ప్రాంతాలు జలమయమయ్యాయి. సంపెంగతోట, భాస్కర్‌నగర్, సాయినగర్, సీతారామ కాలనీలు చెరువులుగా మారాయి. ఎడతెరిపి లేని వర్షంతో రైతులు ఆందోళనకు గురవుతున్నారు. ఇప్పటికే ధాన్యం కోతలు పూర్తి కావడంతో, రాశులు ఎక్కడికక్కడే ఉండిపోయాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండలంలో వరి కోతలు ప్రారంభమై రెండు నెలలు గడిచినా ధాన్యం కొనుగోలు కేంద్రాలు సక్రమంగా పనిచేయకపోవడంతో రైతుల వద్ద ధాన్యం పొలాల్లోను, గట్ల వద్ద ఉండిపోయింది. ధాన్యం రాశులను కప్పడానికి బరకాలు కూడా లభించడం లేదని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రైసు మిల్లులకు రోజుకు టార్గెట్ ఇవ్వడం వలన అది పూర్తయిందనే సాకుతో ధాన్యం కొనుగోలు చేయడం లేదని రైతులు వాపోతున్నారు. ధాన్యంలో తేమ శాతం ఉందని, పొల్లు ఉందని మిల్లర్లు ఇబ్బందులకు గురి చేస్తున్నారని వీకే రాయపురం గ్రామానికి చెందిన తలారి దొరబాబు, ఇంటి వెంకట్రావు, జి.మేడపాడుకు చెందిన మోరంపూడి రమేష్, పీబీ దేవం గ్రామానికి చెందిన మలకల సూరిబాబు, మలకల వరహాలబాబు ఆరోపిస్తున్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా రైతుల పరిస్థితి అగమ్యగోచరంగా మారిందని రైతులు వాపోతున్నారు. కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం కొనే పరిస్థితి లేకపోవడంతో దళారులకు విక్రయించి బస్తాకు రూ.200 నష్టపోవాల్సి వస్తుందంటున్నారు. వర్షాలకు ధాన్యాన్ని తరుచూ ఆరబెట్టడానికి ఎకరానికి రూ.నాలుగు వేలు కూలీ అదనంగా అవుతుందని రైతులు చెబుతున్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించినప్పటి నుంచి రైతుల వద్ద ధాన్యం కొనుగోలు ప్రక్రియ ప్రారంభిస్తే, వర్షాల వల్ల రైతులకు ఇబ్బందులు ఉండేవి కావంటున్నారు. గత ప్రభుత్వ హయాంతో రైతుల నుంచి తడిచిన ధాన్యం కూడా వెంటనే కొనుగోలు చేసిన సంఘటనలను రైతులు గుర్తు చేసుకుంటున్నారు.


తడిసిన ధాన్యం ఆరబెడుతున్న రైతులు

తప్పుడు ప్రచారంపై జర్నలిస్టుల ఆందోళన

పిఠాపురం: ప్రజాశక్తి జిల్లా విలేకరి ముమ్మిడి లక్ష్మణ్‌పై అనుచిత వ్యాఖ్యలు చేస్తూ, తప్పుడు ఆరోపణలతో సోషల్ మీడియాలో ప్రచారం జరగడంపై సోమవారం పిఠాపురంలో జర్నలిస్టులు ఆందోళనకు దిగారు. విలేకరి లక్ష్మణ్‌ను నకిలీ విలేకరి అని, అతడిని పోలీసులు అరెస్టు చేశారని సోషల్ మీడియాలో కొందరు ప్రచారం చేశారు. దీనిపై ఆందోళనకు దిగిన జర్నలిస్టులు.. ఉద్దేశపూర్వకంగానే కొందరు నకిలీ ఐడీలతో సోషల్ మీడియా అకౌంట్లు సృష్టించి, తప్పుడు ప్రచారాలు చేస్తున్నారన్నారు. ఇలా జర్నలిస్టులను వేధిస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకుని, జర్నలిస్టులకు రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు. పిఠాపురం సర్కిల్ పోలీసు స్టేషన్ వద్ద ఆందోళన నిర్వహించిన జర్నలిస్టులు అనంతరం పోలీసులకు ఫిర్యాదు అందించారు. అలాగే కాకినాడలో జిల్లా ఎస్పీకి ఫిర్యాదు చేశారు. ఈ కార్యక్రమంలో పలువురు జర్నలిస్టులు పాల్గొన్నారు. విలేకరి లక్ష్మణ్‌పై అనుచిత వ్యాఖ్యలు చేస్తూ, తప్పుడు ఆరోపణలతో సోషల్ మీడియాలో ప్రచారం చేసిన వారిపై పోలీసులు కేసు నమోదు చేసి, వెంటనే అరెస్టు చేయాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు దువ్వా శేషుబాబ్జీ డిమాండ్ చేశారు.


పోలీసులకు ఫిర్యాదు అందిస్తున్న జర్నలిస్టులు